



పెద్దాపురం మండలం దివిలిలో చంద్రబాబు అభివాదం

అండగా ఉంటా.. ఆదుకుంటా!



రాజుపాలెంలో చంద్రబాబుతో మాట్లాడుతున్న ముంపు బాధిత మహిళ

- ఏలేరు వరద బాధితుల్లో ధైర్యం నింపిన సీఎం చంద్రబాబు
- బాధితులందరినీ అన్ని విధాలా ఆదుకుంటామని ప్రకటన
- రాజుపాలెం గ్రామానికి ఎక్స్‌కవేటర్‌పై వెళ్లి పలకరించిన సీఎం
- ముంపులో చిక్కుకున్న పెంకుటిళ్లు లోపలకు వెళ్లి బాధితులకు భరోసా
- ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు, దుస్తులు ఇవ్వనున్నట్టు వెల్లడి
- కుళ్లిన వరి కంకులను చంద్రబాబుకు చూపించి రైతుల ఆవేదన
- ఏలేరు ఆధునికీకరణ పూర్తి చేసే బాధ్యత ఎన్డీయేదేనని ప్రకటన
- వడ్లమూరులో రైతు ఇచ్చిన కొబ్బరి బొండం తాగిన చంద్రబాబు
- దివిలి వద్ద విద్యార్థులతో మాటామంతీ.. రాజుపాలెం వద్ద రైతులతో..
- సామర్లకోటలో దిగి.. అక్కడ నుంచి వెళ్లి ఏలేరు కాలువ పరిశీలన





కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామంలో ముంపు ప్రాంతాలను ఎక్స్‌కవేటర్‌లో వెళ్లి పరిశీలిస్తున్న చంద్రబాబు.. నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం



రాజుపాలెంలో ఏలేరు కాలువను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



పెద్దాపురం మండలం వడ్లమూరులో ఏలేరు కాలువ పరిశీలిస్తున్న చంద్రబాబు.. వరదకు దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న సీఎం

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/పెద్దాపురం/కిర్లంపూడి/సామర్లకోట, సెప్టెంబరు11: 'ఏలేరు వరద బాధితులకు అండగా ఉంటా. ప్రతి ఒక్కరు ధైర్యంగా ఉండాలి. ప్రతి వరద బాధిత కుటుంబానికి రూ.10వేలు సాయం చేస్తా.తక్షణం దుస్తులు పంపిణీ చేయిస్తా. పంటలు నష్టపోయిన అన్నదాతలకు హెక్టారుకు రూ.25వేల సాయం, ఎరువులు, పొటాషియం అందిస్తా. ఇళ్లు దెబ్బతిన్న వారికి ఇళ్లు కట్టిస్తాను' అని సీఎం చంద్రబాబు ధైర్యం చెప్పారు. ప్రతిఒక్కరికీ సాధ్యమైనంత వేగంగా సాయం పంపిణీ చేయిస్తామని వివరించారు. ఏలేరు వరద బాధిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు బుధవారం పర్యటించారు. మధ్యాహ్నం 1.53 గంటలకు సామర్లకోట జూనియర్ కాలేజీ మైదానంలో హెలీకాప్టర్‌లో దిగారు. అక్కడ నేతలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం నేరుగా కిర్లంపూడి మండలం రాజుపాలెం వరద ముంపు గ్రామం పరిశీలనకు వెళ్లారు. మార్గమధ్యలో బస్సు దిగి పెద్దాపురం మండలం వడ్లమూరు బ్రిడ్జిపై నుంచి ఏలేరు వరదను పరిశీలించారు. వరద తమ పొలాలను ఏవిధంగా ముంచేసిందో కొందరు రైతులు చంద్రబాబుకు వివరించారు. అనంతరం దివిలి సెంటర్‌లో టీఎస్సార్ కాలేజీ విద్యార్థులు సీఎం కోసం వేచి చూడగా వీరిని చూసి సీఎం బస్సు దిగారు. వారితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థులు రూ.లక్ష చెక్కును ఏలేరు వరద బాధితుల సహాయం కోసం అందించారు. అక్కడి నుంచి సీఎం రాజుపాలెం గ్రామానికి చేరుకున్నారు. అప్పటికీ గ్రామంలో ఛాతివరకు వరద నీరు ప్రవహిస్తోంది. ఏలేరుకు గండిపడడంతో పూర్తిగా వరద ముంపులో చిక్కుకున్న గ్రామానికి సీఎం సాహసం చేసి ఎక్స్‌కవేటర్‌పైకి ఎక్కారు. పక్కనే ఏలేరు వరద ఉధృతి కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఎన్ని ఎకరాల మేర పంటలు మునిగాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత వరద ముంపులో చిక్కుకున్న ఇళ్ల వద్దకు మోకాళ్లోతు నీటిలోకి దిగి వెళ్లారు. తొలుత కాకాడ వసంతరావు ఇంటికి వెళ్లారు. ముంపుతో ఏ విధంగా నష్టపోయామో బాధితులు సీఎంకు వివరించగా పక్కనే ఉన్న కలెక్టర్‌ను పిలిచి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆదేశించారు. ఆ తర్వాత వినకోటి కోటేశ్వరరావు, గణేశుల బాబురావు, చక్రవర్తుల సత్యన్నారాయణమ్మ, కేలంగి వెంకటలక్ష్మి, స్థానిక ఎస్సీ పేటకు చెందిన వికలాంగుడు దెయ్యాల నాగు తదితర కుటుంబాలతో చంద్రబాబు మాట్లాడారు. వరదకు ఇళ్లు ముంపుతో నష్టపోయిన తీరును చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. భూపాలపట్నంలో ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతిచెందడంతో ఆ విషయం తెలుసుకున్న చంద్రబాబు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం అక్కడి నుంచి సీఎం రాజుపాలెం పంచాయతీకి చేరుకుని బాధితులకు నిత్యావసర సరుకులు అందించారు. కిర్లంపూడి, పెద్దాపురం మండలాల్లోని వరద ముంపు ప్రాంతాలను సందర్శించిన అనంతరం సీఎం చంద్రబాబు సామర్లకోట చేరుకుని జిల్లా ఉన్నతాధికారులతోను, ప్రజాప్రతినిధులతోను సమీక్షిస్తారని ముందుగా అధికారులు ప్రకటించారు. అందుకు అనుగుణంగా బుధవారం మధ్యాహ్నం సామర్లకోట టీటీడీసీ ఆవరణలో వరద ప్రాంతాల ఛాయా చిత్రప్రదర్శన ఏర్పాటు చేశారు. కిర్లంపూడి మండలం రాజుపాలెంలో బాధిత రైతులతో మమేకమైన సీఎం అక్కడ అధిక సమయం ఉండడంతో అప్పటికప్పుడు సామర్లకోటలోని కార్యక్రమం రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో అక్కడే ఉన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మీ సత్యనారాయణమూర్తిలు హెలీపాడ్ వద్దకు సీఎంకు వీడ్కోలు పలికేందుకు తరలివెళ్లారు.

ఏలేరు ఆధునికీకరణ బాధ్యత ఎన్డీయేదే..

ఏలేరు కాలువ ఆధునికీకరణ బాధ్యత పూర్తి బాధ్యత ఎన్డీయేదే అని చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రజలు కష్టాలు వచ్చాయన్నారు. ఏలేరు రిజర్వాయర్‌కు ఒకేసారి 47వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చిందని, కిందకు వదలకపోతే ప్రాజెక్టుకు ప్రమాదం కావడంతో వరద వదలారన్నారు. దీంతో పలు ప్రాంతాలు నీట మునిగాయన్నారు. వరదల కారణంగా జిల్లాలో 65 వేల ఎకరాలు పంట పొలాలు దెబ్బతిన్నాయన్నారు. ఏలేరు వరదపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నారన్నారు. వరద ఏలేరు కాలువల్లో ఎలా ప్రవహిస్తోంది. గండ్లు ఎక్కడ పడే అవకాశం ఉందనే దానిపై అధికారులు డ్రోన్ల ద్వారా చూసి కలెక్టర్ సమయస్ఫూర్తితో వ్యవహరించారన్నారు. కాగా సీఎం ప్రయాణించిన బస్సులో ఎమ్మెల్యేలు ఎక్కారు. కిర్లంపూడిలో వరద ప్రభావం గురించి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చంద్రబాబుకు వివరించారు. ఏలేరు రిజర్వాయరుకు వస్తోన్న ఇన్‌ఫ్లో, కాలువలకు గండ్ల పరిస్థితిని ఎమ్మెల్యే సత్యప్రభ వివరించారు. పిఠాపురం మునిగిన తీరును ఫోటోలతో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ చంద్రబాబుకు వివరించారు. బాబు వెంట ఎమ్మెల్యేలు యనమల దివ్య, పంతం నానాజీ, దాట్ల బుచ్చిరాజు, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, చిక్కాల రామచంద్ర రావు, జ్యోతుల నవీన్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, మాజీ ఎంపీటీసీ గొడే దొరబాబు, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు ఉన్నారు.

పి.గన్నవరం: ఉడిమూడి ఏటిగట్టు చెంతనే నీట మునిగిన సంచార జాతుల గుడిసెలు



భయం గుప్పెట్లో..

- లంక గ్రామాల్లో గోదారి ఉధృతి
- కాజ్‌వేలపై వరద ప్రవాహం
- మునుగుతున్న పొలాలు



ముమ్మిడివరం: గురజాపులంకలో ఇంజన్ బోటుపై రాకపోకలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గోదావరికి వరద పెరుగుతున్న నేపథ్యంలో నదీ పరివాహక లంక గ్రామాల ప్రజలు భయం గుప్పెట్లో జీవిస్తున్నారు. ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి నది ప్రవహిస్తోంది. సుమారు 14.50 లక్షల క్యూసెక్కుల నీటిని బంగాళాఖాతంలోకి విడుదల చేయడంతో కోనసీమ జిల్లాలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధ గౌతమీ నదీ పాయల్లో వరద క్రమంగా పెరుగుతూ లంక గ్రామాలను ముంచెత్తుతోంది. ఇప్పటికే నది పరివాహక మధ్య లంకల్లో ఉన్న పశువులను, పంటలను సంరక్షించుకుని సురక్షిత ప్రాంతానికి తరలించుకునే పనిలో రైతులు ఉన్నారు. గత కొన్ని రోజుల నుంచి వరద ప్రభావం పెరుగుతుండడం వల్ల లంక గ్రామాల్లోకి రాకపోకలు స్తంభించి ఆయా గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి కోనసీమలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి వరద పరిస్థితి, అధికారుల సన్నద్ధతపై ఆరా తీస్తున్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్ ఐ.పోలవరం మండలంలోని గౌతమి నది పరివాహక ప్రాంతాల్లోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. వరద పెరుగుదలపై అంచనాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జాయింట్ కలెక్టర్ నిషాంతి సఖినేటిపల్లి మండలంలోని అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించి వరద ముంపు ప్రభావిత గ్రామాల్లోని ప్రజలను పరామర్శించారు. అక్కడ పరిస్థితులపై వారి నుంచి సమాచారం తెలుసుకోవడంతో పాటు అధికారుల సన్నద్ధతను సమీక్షించారు. గౌతమీ నది పొంగి కోటిపల్లిలోని ఒడ్డున గల వ్యాపార సముదాయాల్లోకి నీరు చొచ్చుకురావడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముందు జాగ్రత్తగా నదుల్లో పంట్లు, పడవ ప్రయాణాలు కూడా అధికారులు నిలుపుదల చేశారు. వరద ప్రభావానికి గురైన కొన్ని ప్రాంతాల్లో విద్యాసంస్థలకు బుధవారం సెలవు ప్రకటించారు.

ఏటిగట్టుపై జీవనం



పి.గన్నవరం: ఏటిగట్టుపై తాత్కాలిక నివాసం

రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్



అయినవిల్లి, సెప్టెంబరు 11: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో గోదావరి వరద పోటెత్తింది. గౌతమి, వృద్ధ గౌతమి పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లంక గ్రామాలను వరదనీరు చుట్టుముట్టింది. అయినవిల్లిలంక కాజ్‌వే పై వరదనీరు ప్రవహించడంతో ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య బుధవారం కొండుకుదురు, పొట్టిలంక గ్రామాల్లో పర్యటించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా వరద ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీరవల్లిపాలెం, అయినవిల్లి, పొట్టిలంకల్లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని నియమించారు.




ముమ్మిడివరం: కూనాలంక రామాలయం వద్ద రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



మామిడికుదురు: అప్పనపల్లిలో ఎన్డీఆర్ఎఫ్



పి.గన్నవరం: కె.ఏనుగుపల్లిలో..



పి.గన్నవరం:గంటిపెదపూడి శివారు బూరుగులంక రేవులో రాకపోకలు

మునుగుతున్న లంకలు

పి.గన్నవరం, సెప్టెంబరు 11: భద్రాచలం వద్ద వరద ఉధృతి తగ్గినప్పటికి దిగువున క్రమంగా పెరుగుతోంది. పి.గన్నవరం మండలంలోని గంటిపెదపూడి ఏటిగట్టు దిగువున కాజ్‌వే, కె.ఏనుగుపల్లి కాజ్‌వే నీట మునగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కె.ఏనుగుపల్లిలో కాజ్‌వేపై వరద ప్రవాహంతో హైస్కూల్‌కు సెలవు ప్రకటించి విద్యార్థులను సురక్షితంగా కాజ్‌వేను దాటించారు. అలాగే గంటిపెదపూడిలో కాజ్‌వేను దాటుకుని బూరుగులంక నదీపాయ వద్దకు వెళ్లడానికి నాలుగు లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా మానేపల్లి శివారు శివాయిలంక, చినకందాలపాలెం రోడ్లపైకి వరదనీరు రావడంతో లంక గ్రామస్థులు ట్రాక్టర్లపై రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే నాగుల్లంక శివారు పల్లిపాలెం ఇళ్ల చుట్టూ, మొండెపులంక పంట పొలాల్లోకి ఇప్పుడిప్పుడే వరదనీరు ప్రవేశిస్తోంది. ఉడిమూడి ఏటిగట్టు చెంతనే ఉన్న సంచార జాతుల వారి నివాస గృహాలు నీట మునగడంతో ఏటిగట్టుపై నివాసాలు ఏర్పాటు చేసుకోగా 17 మంది వరద బాధితులకు తహశీల్దార్ పి.శ్రీపల్లవి స్థానిక పాఠశాలలో భోజనాలు ఏర్పాటు చేయించారు. గంటిపెదపూడి, ఉడిమూడి శివారు నాలుగు లంక గ్రామాలతో పాటు పశ్చిమ గోదావరి జిల్లా గ్రామాలైన కనకాయలంక, పెదమల్లంక, అనగర్లంక తదితర గ్రామాల వాసులు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

పెరుగుతున్న వరద ఉధృతి

ముమ్మిడివరం, సెప్టెంబరు 11: ముమ్మిడివరం మండలంలో లంక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. బుధవారం సాయంత్రానికి వివేకానంద వారధి, గురజాపులంక సిమెంటు రోడ్డు పైనుంచి కూనాలంక నుంచి వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో గురజాపులంక ప్రజలు ఇంజను పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. కూనాలంక రామాలయం వద్ద గురజాపులంక సిమెంటు రోడ్డుపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గురజాపులంక, కూనాలంక, లంకాఫ్ ఠాణేలంకలలో ఇంటర్నల్ రోడ్లు వరదనీటితో మునిగాయి. లంకాఫ్ గేదెల్లంక, చింతపల్లిలంక, సలాదివారిపాలెం తదితర లంక గ్రామాల్లో పల్లపు లంకభూములు వరద నీటితో మునిగాయి. వరద ప్రత్యేక అధికారి మధుసూదనరావు, తహసీల్దార్ ఎం.సుబ్బలక్ష్మి లంక గ్రామాల్లో పర్యటించి ప్రజలను, అధికారులను అప్రమత్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ కొనసాగుతోంది. వీఆర్వోలు స్థానికంగా ఉండి పరిస్థితులను సమీక్షించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. లంక గ్రామల్లో ఏర్పాటుచేసిన వైద్య ఆరోగ్య శిబిరం కొనసాగుతోంది. ముంపు ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. వరద ఉధృతి పెరిగితే సహాయక చర్యలు అందించేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది 36 మందిని సిద్ధంగా ఉంచారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు లంకాఫ్ ఠాణేలంక, గురజాపులంక, కూనాలంక వద్ద మూడు మెకనైజ్డ్ బోట్లు సిద్ధం చేశారు.

రాకపోకలు నిలుపుదల

అంతర్వేది, సెప్టెంబరు 11: మూడో సారి వరదలు పెరిగిన కారణంగా సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో పంటు రాకపోకలు నిలుపుదల చేశారు. ఒక్కసారిగా వరద పెరిగిపోవడంతో వరదనీరు పైకిచేరి ఇప్పటికే లంక వాసులు ఇబ్బందులు పడుతున్నారు. సఖినేటిపల్లి రేవు నుంచి నర్సాపురం వెళ్లే చిరు వ్యాపారులు, ప్రజలు పంటు రాకపోకలు నిలుపుదలతో ప్రత్యామ్నాయం చూసుకోవాలని అధికారులు సూచించారు.



గోగుల్లంకలో పర్యటిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి ● కలెక్టర్ మహేష్‌కుమార్

ఐ.పోలవరం, సెప్టెంబరు 11: గోదావరి వరద విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. మురమళ్ల, ఎదురులంక, గుత్తెనదీవి, గోగుల్లంకల్లో బుధవారం ఆయన పర్యటించారు. వరద పెరుగుతున్న కారణంగా నదీతీరం వెంబడి లంక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే బాధితులు పునరావాస కేంద్రాలకు తరలి రావాలన్నారు. బాధితులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన సహాయం అందించేందుకు స్థానిక అధికార యంత్రాంగానికి ఆదేశాలిచ్చామన్నారు. పునరావాస కేంద్రాలను కూడా సిద్ధం చేశామన్నారు. రాబోయే 48 గంటల పాటు లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. గోదావరి ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షాల కారణంగా కోనసీమకు వరద ముప్పు పొంచి ఉందని, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎదుర్లంక ప్రజలతో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గుత్తెనదీవి, గోగుల్లంకల్లో పర్యటించి అక్కడ వైద్యశిబిరాన్ని సందర్శించారు. మత్స్యకారులతో మాట్లాడి ఇసుక తవ్వకాలపై ఆరా తీశారు. మండల ప్రత్యేక అధికారి వి.బోసుబాబు, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, ఎంపీడీవో చైతన్యభరత్‌కుమార్ పాల్గొన్నారు.



మామిడికుదురు: ఉప్పులవారిపేటలో వరద నీటిలో ప్రయాణం



ఆత్రేయపురం: బొబ్బర్లంక బ్యారేజ్ వద్ద వరద ఉధృతి



పిఠాపురం మండలం గోకివాడలో ఏలేరు వరద ఉధృతితో ఏకమైన పొలాలు, రహదారి

"ఏలేరు వరదతో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం అతలాకుతలమైంది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. కాలువలకు భారీ గండ్లు పడ్డాయి. పలుచోట్ల పంట కాలువలు చిన్నాభిన్నమయ్యాయి. పంట పొలాల్లో ముంపు భారీగా పెరిగింది. ఇన్‌ఫ్లోస్ తగ్గించామని ఏలేరు ఇరిగేషన్ అధికారులు చెప్తున్నా ఉధృతి మాత్రం తగ్గలేదు."

- పిఠాపురం నియోజకవర్గం అతలాకుతలం
- కాలువలకు ఇరవై ఐదుకి పైగా గండ్లు
- పంట పొలాల్లో పెరిగిన ముంపు
- ఏలేరుకు ఇన్‌ఫ్లోస్ తగ్గినా అదే స్థాయిలో వరద ఉధృతి

వీడని ఏలేరు వరద

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు 11: పిఠాపురం నియోజకవర్గాన్ని ఏలేరు వరద చుట్టుముట్టి జనజీవనాన్ని, పంటలను కకావికలం చేసింది. పంట పొలాలు జలాశయాలు, సముద్రాన్ని తలపిస్తున్నాయి. ఏలేరు ప్రాజెక్టు నుంచి విడుదలైన వరద నీటికి సుద్దగడ్డ వరద ఉధృతి తోడవ్వడంతో పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు రెండు మండలాల పరిధిలోని గ్రామాల్లో 21వేల ఎకరాల్లో వరి, పత్తి, కాయగూర పంటలు ముంపులో కొనసాగుతున్నాయి. పిఠాపురం, గొల్లప్రోలు బైపాస్, పట్టణాల పరిధిలోని పంట పొలాలు వరద నీటితో సముద్రాన్ని తలపిస్తున్నాయి. కొత్తపల్లి మండలాన్ని కూడా ఏలేరు వరద ముంచెత్తింది. ఇక్కడ నాలుగు వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు నీట మునిగాయి.

ఏలేరు వరద ఉధృతికి భారీగా గండ్లు పడ్డాయి. బుధవారం సాయంత్రం వరకు గొర్రిఖండి, నక్కలఖండి, పిప్పికాలువ, గొల్లప్రోలు కాలువ, పిడిందొడ్డి, ఎదురొడ్డి, బాడవ, పులిదొడ్డి, తుపాకిగడ్డ సహా పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో ఏలేరు నీరు ప్రవహించే కాలువలకు 25గండ్లు పడ్డాయి. ఇందులో పదికి పైగా గండ్లు అతి భారీగా ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. పలుచోట్ల గట్లు తెగిపోయినట్టు రైతులు తెలిపారు. కొన్నిచోట్ల గట్లు కనిపించని పరిస్థితి ఉంది. ఏలేరు, సుద్దగడ్డ వరదతో గొల్లప్రోలు పట్టణంలోని కాలనీల్లో వరద ముంపు గణనీయంగా పెరిగింది. గొల్లప్రోలులోని గాంధీనగరం, మార్కండేయపురం, రాయవరం రోడ్డు, ఎస్సీ కాలనీ, అరుంధతీయపేట, సూరంపేట, జగనన్న కాలనీ, శివాలయమాన్యం ప్రాంతాలన్నీ వరద ముంపులో చిక్కుకున్నాయి. గాంధీనగర్, రాయవరం రోడ్డు ప్రాంతాల్లో రెండున్నర, మూడు అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తోంది. సూరంపేట, జగనన్న కాలనీకి బోట్లులోనే రాకపోకలు సాగుతున్నాయి. ఒక్క గొల్లప్రోలు పట్టణంలోనే 2,500 కుటుంబాలు వరద ప్రభావానికి గురయ్యాయి. వెయ్యికి పైగా గృహాలు ముంపులో చిక్కుకున్నాయి. పిఠాపురం పట్టణంలోని రాపర్తి రోడ్డు, అగ్రహారం మెట్ట శివారు ప్రాంతాల్లోని ఇళ్లు ముంపునకు గురయ్యాయి. పట్టణంలోని కోర్టుల నుంచి ఇల్లింద్రాడ వరకు అరకిలో మీటరు మేర వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు.

కాకినాడ-కత్తిపూడి మధ్య గల 216వ జాతీయ రహదారి జలదిగ్బంధంలో



గొల్లప్రోలు గాంధీనగర్‌లో ఏలేరు వరద నీటిలో మునిగిన గృహాలు

చిక్కుకుంది. గొల్లప్రోలు బైపాస్ రోడ్డు, టోల్‌ప్లాజా, ఇల్లింద్రాడ, పిఠాపురం బైపాస్‌రోడ్డులో రాపర్తి జంక్షన్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా ఎనిమిది ప్రాంతాల్లో బుధవారం ఏలేరు వరద నీరు ప్రవహించింది. దీంతో మంగళవారం సాయంత్రం నుంచి ఈ రహదారిపై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. రాత్రి ఎటువంటి వాహనాలు వరద నీటిలోకి వెళ్లకుండా బారికేడ్లు పెట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం వరద ఉధృతి కొనసాగడంతో సాయంత్రం వరకు వాహనాలను పోలీసులు అనుమతించలేదు. అయితే పలువురు వాహనచోదకులు ప్రమాదమని తెలిసినా వరద నీటిని దాటేందుకు ప్రయత్నం చేసి చిక్కుల్లో పడ్డారు. వాహనాలు పక్కకు లాగేయడంతో కొందరు ఇబ్బందులకు గురయ్యారు. జాతీయ రహదారిపై ప్రవాహ ఉధృతి సాయంత్రం స్వల్పంగా తగ్గుతున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం నుంచి రాకపోకలకు అనుమతి ఇచ్చారు. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకూ ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు. అనంతరం పునరుద్ధరించారు. పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు.



రమణక్కపేటలో వరద నీటిలో చిక్కుకున్న దేవాలయం

కొత్తపల్లిని ముంచెత్తింది

- 4వేల ఎకరాల్లో పంటలు మునక
- 750 ఇళ్లల్లోకి వరద నీరు
- పునరావాస కేంద్రాల్లో బాధితులకు భోజనం: తహసీల్దారు

కొత్తపల్లి, సెప్టెంబరు 11: ఏలేరు రిజర్వాయర్‌లో అదనపు నీటిని కిందికి విడుదల చేయడంతో మండలంలో పలు గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. కొండెవరం, ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట, యండపల్లి, శ్రీరాంపురం తదితర గ్రామాల్లో 4వేల ఎకరాల్లో సార్వా పంట పూర్తిగా ముంపునకు గురైంది. కొండెవరం శివారు కాశివారి పాకలులో 70, కొండెవరం శివారు ఇందిరానగర్‌లో 80, యండపల్లి శివారు తోటూరులో 30, కొత్త ఇసుకపల్లిలో జగనన్న కాలనీలో 60, నాగులాపల్లి ఎస్సీపేటలో 200, పాత ఇసుకపల్లి బీసీ కాలనీలో 140, రమణక్కపేటలో 150 ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. రమణక్కపేటలో దేవాలయ ప్రాంగణం వరద నీటితో మునిగింది. వరద ముంపునకు గురైన గ్రామాల్లో బాధితులకు స్థానికంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వరద ఉధృతి తగ్గే వరకు బాధితులకు భోజన సదుపాయం కల్పిస్తామని తహసీల్దారు చిన్నారావు తెలిపారు.

వరద బాధితులకు భోజనం పంపిణీ చేయడానికి వెళ్లి...

నీటిలో వ్యక్తి గల్లంతు, మృతదేహం లభ్యం

కిర్లంపూడి, సెప్టెంబరు 11: ఏలేరు వరద నీటి ప్రవాహంలో గల్లంతై ఓ వ్యక్తి మృతి చెందాడు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన గొంతిన సుబ్బారావు (35) మంగళవారం రాత్రి వరద బాధితులకు భోజనం పంపిణీకి వెళ్లాడు. తిరిగి వస్తుండగా వరదనీటిలో గల్లంతయ్యాడు. రాత్రి నుంచీ వెదకగా బుధవారం ఉదయం ముంపు కాలనీలో ఓ చోట సుబ్బారావు మృతదేహం తేలియాడింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. హెచ్‌సీ ఎస్.వెంకటరమణ కేసు నమోదు చేశారు.

సూరంపేటలో వ్యక్తి మృతి

బోటులో మృతదేహం తరలింపు... వరద నీటిలో అంత్యక్రియల నిర్వహణకు అగచాట్లు



వరద నీటిలో మృతదేహాన్ని బోటులో తరలిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, సెప్టెంబరు 11: చనిపోయిన వ్యక్తికి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకూ ఇబ్బందులు తప్పలేదు. వరద నీటిలోనే మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారు సూరంపేటకు చెందిన ఇసరపు సూరిబాబు (62) బుధవారం మరణించాడు. సూరంపేట చుట్టూ ఏలేరు, సుద్దగడ్డ వరద నీరు ఉండటడతో అంతిమ సంస్కారాలు ఎలా నిర్వహించాలో తెలియక సంబంధీకులు సతమతమయ్యారు. అక్కడ ఉన్న జనసైనికులు, స్థానికులు విషయాన్ని గొల్లప్రోలు తహసీల్దారు సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి బోటు ఏర్పాటు చేశారు. వీఆర్వో పరమేశ్వరరాజు దగ్గరుండి బోటుపై మృతదేహాన్ని సూరంపేట నుంచి పట్టణంలోకి తీసుకువచ్చారు. అక్కడి నుంచి వరద నీటిని దాటి మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఉన్న శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిపారు



వరద నీటిలోనే మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న దృశ్యం



ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ఎగువున వరద నీరు

ఎగువున తగ్గుతూ... ధవళేశ్వరం వద్ద పెరుగుతూ

- కాటన్ బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- రాత్రి 7 గంటలకు 15.10 అడుగులకు చేరిన నీటిమట్టం
- 15 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం/రాజమహేంద్రవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువన భద్రాచలం వద్ద తగ్గుముఖం పడుతూండగా ధవళేశ్వరం వద్ద మరింత పెరుగుతోంది. బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు నీటిమట్టం 13.75 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 13 లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహించింది. ఆపై క్రమంగా పెరుగుతూ నీటిమట్టం రాత్రి 7గంటలకు 15.10 అడుగులకు చేరుకోగా 15,06,089 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. మరో 30వేల క్యూసెక్కుల వరద పెరిగి ఆపై తగ్గుదల నమోదు కావచ్చని అధికారుల అంచనా. ఎగురున భద్రాచలం వద్ద బుధవారం ఉదయానికి 50.50 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం తగ్గుముఖం పట్టి రాత్రి 7గంటలకు 48.40 అడుగులుగా నమోదైంది.

- ధవళేశ్వరం వరద ఉధృతి కారణంగా గోదావరి లంకల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రజలు ఘాట్లలో స్నానాలకు దిగకుండా పోలీసులు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులకు 24 గంటలూ మూడు షిఫ్టుల కింద డ్యూటీలు వేశారు.
- మరోవైపు వినాయక విగ్రహాల నిమజ్జనానికి అధికారులు నిబంధనలు విధించారు. ప్రజలెవరూ విగ్రహాలను నేరుగా నిమజ్జనం చేయడానికి వీలులేదన్నారు. విగ్రహాలను రేవుల వద్ద అధికారులకు అప్పగిస్తే వారే నిమజ్జనం చేస్తారని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు.



లంక గ్రామాల ప్రజలకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ సమీపంలోని మున్సిపల్ కల్యాణ మండపంలో ఆశ్రయం కల్పించిన దృశ్యం

విద్యుతాఘాతంతో తాపీమేస్త్రీ మృతి

ఎటపాక, సెప్టెంబరు 11: ఎటపాకకు చెందిన తాపీమేస్త్రీ డేగల నర్సింహారావు (42) స్థానికంగా ఓ ఇంటి రెండో అంతస్తు గదికి ప్లాస్టింగ్ కోసం (పరంజీ) బుధవారం సెంట్రింగ్ కర్రలు అమర్చుతున్నాడు. ఆ సమయంలో సెంట్రింగ్ కర్ర పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ వైరును తాకడంతో విద్యుతాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

నేటి నుంచి థర్మల్ డ్రోన్‌తో చిరుత పులి గాలింపు



దివాన్‌చెరువు, సెప్టెంబరు 11: 'చిరుత పులి జాడను గుర్తించేందుకు గురువారం నుంచి థర్మల్ డ్రోన్ వినియోగిస్తాం... ఇందుకు ప్రత్యేక బృందం వస్తోందని తూర్పు గోదావరి జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి బుధవారం రాత్రి తెలిపారు. గత రెండు రోజులుగా సాధారణ డ్రోన్ సహాయంతో గాలించినా చిరుతపులి జాడ కనిపించలేదన్నారు. దీంతో థర్మల్ డ్రోన్ రప్పించామని చెప్పారు. దానిని ఆపరేట్ చేసేందుకు కుడా అనుభవజ్ఞులైన ఆపరేటర్లు ఇక్కడ అందుబాటులో లేకపోవడంతో వేరే ప్రాంతం నుంచి తీసుకు వస్తున్నామన్నారు. థర్మల్ డ్రోన్‌తో పగటి పూటతో పాటు రాత్రి కూడా గాలింపు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కాగా బుధవారం కూడా ట్రాప్ కెమెరాలో చిరుత పులి జాడ కనిపించలేదన్నారు. దివాన్‌చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం కోసం ట్రాప్ కెమెరాల అమరికలో మార్పుటు చేసినట్టు చెప్పారు. చిరుత సంచారం బట్టి అనుమానాస్పద ప్రాంతంలో రెండు ట్రాప్ బోనులను స్థానాలు మార్చి దానిని పట్టుకునేందుకు పూర్తి ప్రయత్నం చేస్తున్నామని వివరించారు.

నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో

ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

అన్నవరం, సెప్టెంబరు 11: అన్నవరం దత్తత దేవాలయమైన కోరుకొండ ఆలయానికి సంబంధించి వివిధ పద్దుల కింద వసూలైన నిధుల్లో సుమారు రూ.15 లక్షలు గోల్‌మాల్ అయిన వ్యవహారంలో జూనియర్ అసిస్టెంట్ కొంతం సతీష్, రికార్డ్ అసిస్టెంట్లు టి.అనిల్‌కుమార్, ఆర్.రవికుమార్‌లను బాధ్యులు చేశారు. వారు ముగ్గురినీ సస్పెండ్ చేస్తూ ఈవో రామచంద్రమోహన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారంలోపు సంజాయిషీ ఇవ్వాలని, లేకుంటే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తుర్వుల్లో పేర్కొన్నారు. గతంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన కిషోర్‌కుమార్, ప్రస్తుత లీజుల విభాగం సూపరింటెండెంట్ కాపారపు శివలకు పర్యవేక్షణ లోపం కారణంగా చార్జి మెమో ఇచ్చినట్టు అధికారులు తెలిపారు. వీరితో పాటు అన్నవరం దేవస్థానం నుంచి బదిలీపై వెళ్లిన ఉప కమిషనరు రమేష్‌బాబు, ఏఈవో శ్రీనివాసరావులను ఈ వ్యవహారానికి సంబంధించి దేవదాయ శాఖ కమిషనరు దృష్టిలో పెట్టి అక్కడి నుంచి వివరణ తీసుకునేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిసింది.



ఆలయానికి చేరిన పవిత్రాలను చూపిస్తున్న అర్చకులు, అధికారులు

అంతర్వేదిలో నేటి నుంచి

పవిత్రోత్సవాలు

అంతర్వేది, సెప్టెంబరు 11: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నుంచి నాలుగు రోజులు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి ప్రత్యేక పూజలు చేయించిన పవిత్రాలను అంతర్వేది తీసుకొచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఉత్సవాలను తిలకించాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FINANCE

గవర్నమెంట్ ఎంప్లాయిస్‌కి, రిటైర్డ్ పెన్షనర్లకి సులభవాయిదాలలో ఫైనాన్స్ మరియు ఇళ్ళు, స్థలాలపైన బ్యాంకులోను ఉన్నా సరే సెకండ్ మార్ట్‌గేజ్‌పై లోను 10లక్షల లోపు చెయ్యబడును. (సిబిల్ చూడబడదు) సెల్: 9666547338

AJH-186739

FINANCE

గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. **Cell: 9550648668**

AJD:186738

WANTED

ప్రముఖ పూజ సామాగ్రి అయిన కర్పూరం, అగరబత్తీలు, ఒత్తులు నందు మండల డీలర్స్, డిస్ట్రిబ్యూటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర॥ 82977 51599, 9515983309.

AJG-2166

4 Lines CLASSIFIED Rs. 230/- Only

వరద నీటిలో మునిగి రైతు మృతి



సూరిబాబు (పాత చిత్రం)

ఎటపాక, సెప్టెంబరు 11: పశువుల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు గోదావరి వరద నీటిలో మునిగి గిరిజన రైతు మృతి చెందాడు. మండలంలోని కృష్ణవరం పంచాయతీ గొందిరాజుపేట గిరిజన గ్రామానికి చెందిన రైతు కౌలూరి సూరిబాబు (37) బుధవారం సాయంత్రం ఇంటి వెనుక శివారు ప్రాంతంలో మేతకు వెళ్లిన తమ బంధువుల పశువులను తోలుకొచ్చేందుకు వెళ్లాడు. గోదావరి వరదతో నిండిన గ్రావెల్ గోతిలో పడి మునిగిపోయాడు. ఎంతసేపటికీ రాకపోయేసరికి కుటుంబ సభ్యులు ఆరా తీసి వెంటనే అక్కడకు వెళ్లారు. వరద నీటిలో పడిన ఆనవాళ్లను గుర్తించారు. గాలింపు చర్యలు చేపట్టగా సూరిబాబు మృతదేహం లభ్యమైంది. సూరిబాబుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

321 మంది సీఆర్‌టీల కొనసాగింపునకు ఉత్తర్వులు

ఎమ్మెల్యే శిరీష చొరవతో స్పందించిన కమిషనరు

రంపచోడవరం, సెప్టెంబరు 11: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో కాంట్రాక్టు టీచర్లను కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం బుధవారం ఆదేశాలు జారీ చేశారని ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే శిరీషదేవి చొరవతో కమిషనరు స్పందించారు. ఆయా విద్యాలయాల్లో ఉన్న ఖాళీల ఆధారంగా 321 మంది సీఆర్‌టీలను మరో ఏడాది కొనసాగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొలిక్కిరాని సత్యదేవుడి విమాన గోపురం

స్వర్ణ తాపడం అంచనాలు

- చదరపు అడుగుకు 25 గ్రాముల బంగారమైతే 72 కిలోలు
- 5 గ్రాముల చొప్పునైతే 15 కిలోల బంగారం అవసరం

అన్నవరం, సెప్టెంబరు 11: రత్నగిరివాసుడైన సత్యదేవుడి విమాన గోపురం స్వర్ణతాపడం అంచనాలు ఇంకా కొలిక్కిరాలేదు. తిరుమల తిరుపతి దేవస్థానం బృందం సుమారు 114 కిలోల బంగారం పడుతుందని, 90 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈవో రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు రిటైర్డ్ డిప్యూటీ స్థపతి బుధవారం వచ్చి పరిశీలించారు. చుట్టూ ఉన్న నాలుగు గోపురాలు మినహాయిస్తే చదరపు అడుగుకు రాగిరేకుపై 25 గ్రాముల బంగారం వినియోగిస్తే సుమారు 72 కిలోలు అవసరం ఉంటుందని, దీనికి సుమారు రూ.60 కోట్లు వ్యయం అవుతుందని లెక్కగట్టారు. అయితే ధ్వజస్తంభానికి అడుగుకు 5 గ్రాముల బంగారం వినియోగించగా... ఆ ప్రకారం 15 కిలోల బంగారం సరిపోతుందని, రూ.15 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈ రెండు ప్రతిపాదనలను ఈవో రామచంద్రమోహన్ దృష్టిలో పెట్టి దేవదాయ శాఖ కమిషనరు ఆదేశాల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని ఇంజనీరింగ్ అధికారులు చెప్పారు.

విద్యుదాఘాతంతో మహిళకు గాయాలు

వై.రామవరం, సెప్టెంబరు 11: మండలంలోని పనిరిగిన్ని గ్రామానికి చెందిన చోళ్ల అచ్చియ్యమ్మ మోహనాపురంలోని అత్తింటి నుంచి మంగళవారం సాయంత్రం పి.యర్రగొండలోని వదిన ఇంటికొచ్చింది. బుధవారం ఉదయం డాబాపై చీరలు ఆరేస్తుండగా 33 కేవీ విద్యుత్ వైర్లు తగిలి గాయపడింది. గాయపడిన అచ్చియ్యమ్మను వై.రామవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు శరీరం 60శాతానికి పైగా కాలడంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేసినట్టు వైద్యాధికారి రాహుల్ చెప్పారు..

నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

ఆర్.ఒ.సి.నెం.168/1981-ఎ1 | తేది.07-09-2024

వేలం నోటీసు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ నిర్వాహణలో గల ఈ దిగువ తెలిపిన వ్యవసాయ భూముల పంట అనుభవించు గుత్తహక్కును స్వాధీనపరచిన నాటి నుండి 3 సంవత్సరముల కాలమునకు బహిరంగ వేలము తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయములో నిర్వహించబడును. పాటలో పాల్గొను వారు ఈ క్రింది పట్టికలో చూపబడిన సాల్వెన్సీ సర్టిఫికెట్ మరియు ధరావత్తుగా నగదు / డి.డి.రూపములో చెల్లించవలెను. ఏ కారణము తెలుపకయే వేలమును వాయిదా వేయుటకు లేదా రద్దుపరచుటకు కమిషనరు, నగరపాలక సంస్థ వారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములు తెలుసుకొనదలచినచో ఆఫీసు పనిచేయు కాలములో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగము నందు రెవెన్యూ అధికారి-1 వారిని సంప్రదించవచ్చు.

వ నెం.	గ్రామము పేరు	సర్వే నెం.	ఎకరాలు	సాల్వెన్సీ రుసుము (రూ)	ధరావత్తు రుసుము (రూ)	వేలం ప్రారంభించు ధర (రూ)	తేది/ సమయం
1	దొమ్మేరు	488/1	5.77	11,00,000	3,50,000	2,88,500	21.09.2024 / మధ్యాహ్నం గం.3.00
2	పశివేదల	246	3.93	4,50,000	1,50,000	1,23,893	21.09.2024 / మధ్యాహ్నం గం.3.30
3	నందమూరు	337	5.24	6,00,000	2,00,000	1,65,191	21.09.2024 / సాయంత్రం గం.4.00
4	అరికిరేవుల	39	4.46	5,50,000	1,70,000	1,40,602	21.09.2024 / సాయంత్రం గం.4.30
5	మలకపల్లి ధర్మవరం	221/3 47	2.06 7.32	11,00,000	3,55,000	2,95,705	21.09.2024 / సాయంత్రం గం.5.00
6	ధర్మవరం	271	3.7	4,50,000	1,50,000	1,16,643	21.09.2024 / సాయంత్రం గం.5.30

షరతులు: 1) వేలము నందు పాల్గొనదలచిన వారు తమ ఫొటో మరియు సంతకముతో కూడిన గుర్తింపు కార్డు అందచేసి వేలం నందు పాల్గొనవలెను. ఇతరులకు ఆథరైజేషన్ ఇచ్చుట అనివార్యమైనప్పుడు అట్టి ఆథరైజేషను నోటరీ అఫిడవిట్ ద్వారా (ఫొటో, పూర్తి చిరునామాతో సహా) సమర్పించవలెను. ఇతరులు ఎవ్వరికీ అనుమతి లేదు.
2) వేలం ఖాయపరచిన 15 రోజులలో గుత్తదారుడు తమ స్వంత ఖర్చులతో లీజుకాలమునకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నందు రిజిస్ట్రేషన్ చేసుకొనవలెను. లేనిచో గుత్తేదారుని ధరావత్తు జమచేసుకొని లీజు రద్దు చేయబడును.
3) పాట మొత్తమునకు జి.ఎస్.టి.18% అదనము (కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల ప్రకారము)
4) గతములో పాడుకొని కోర్టు కేసులు ఉన్నవారు మరియు నగరపాలక సంస్థకు ఏ విధమైన బకాయిలు ఉన్నవారు పాటలో పాల్గొనుటకు అనర్హులు.
5) గుత్త సొమ్ము ప్రతి సంవత్సరము గుత్త ప్రారంభము అయిన నెలలోనే చెల్లించవలెను.

సం/- **కేతన్ గార్గ్**, ఐ.ఎ.ఎస్.,
కమీషనరు
నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

- లంక పొలాల్లోకి చేరిన వరద నీరు
- లంక గ్రామాల్లో రైతుల ఆందోళన
- ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

నాటకాలకు పూర్వ వైభవం తేవాలి

కొత్తపేట, సెప్టెంబరు11: సినిమాలు, ఇంటర్నెట్ సామాజిక మాధ్యమాల ప్రభావంతో వెనుకబడిన నాటకాలకు పూర్వ వైభవం తీసుకురావాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెం గణపతి నవరాత్రి ఉత్సవాల్లో డీవీ సుబ్బారావు మనుమడు జూనియర్ డీవీ సుబ్బారావు సత్య హరిశ్చంద్ర వారణాసి ఘట్టం ప్రదర్శన చేశారు. డీవీ సుబ్బారావును ఎమ్మెల్యే సత్కరించారు. బీజేపీ నాయకుడు పాలూరి సత్యానందం, సర్పంచ్ త్సామా బాబు, బండారు ధనరాజు, సింగిరెడ్డి గోవిందు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా సీఎం చంద్రబాబు: ఎంపీ

పి.గన్నవరం, సెప్టెంబరు11: విపత్తులను ధైర్యంగా ఎదుర్కొని వరద బాధితులకు సీఎం చంద్రబాబునాయుడు అండగా నిలిచారని అమలాపురంఎంపీ హరీష్‌మాధుర్ అన్నారు. పి.గన్న వరం నియోజకవర్గం నుంచి విజయవాడ ఇబ్రహింపట్నం వరద బాధిత గ్రామాలకు పశుగ్రాసం తీసుకువెళ్లే వాహనా లను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబా బులతో కలిసి ఆయన జెండా ఊపి పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు సహకారంతో వరదలను సమర్థవంతగా ఎదుర్కొందన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ అధినాయకుడు సూచనలతో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి నాయకులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కోఆర్డినేషన్ కన్వీనర్ నామన రాంబాబు మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి రూ.5లక్షల విలువైన ఎండు గడ్డి, పశుదాణాను ఎనిమిది వాహనాల్లో పం పించామన్నారు. నామన ఫౌండేషన్ ద్వారా వరద బాధి తులకు రూ.50వేలు, సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ.లక్ష ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో



పి.గన్నవరం కూటమి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ హరీష్‌మాధుర్

ఎంపీపీ గనిశెట్టి నాగ లక్ష్మి, మెట్ల రమణబాబు, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, సంసాని పెద్దిరాజు, డి.వి.వి.సత్యనారాయణ, శిరిగినీడి వెంకటే శ్వర రావు, మట్టపర్తి రామకృష్ణ, ఆరుమిల్లి లాల్‌బాబు, కుమార్, తోలేటి సత్తిబాబు, యర్రంశెట్టి సాయి బాబు, సాధనాల శ్రీవెం కటసత్యనారాయణ, ఆరుమిల్లి సాయి బాబు, మోల్లేటి శ్రీను, శేరు శ్రీనుబాబు, యంద్ర శ్రీనివాస్, నక్కా సత్యనారాయణ, కేదాశి చిన్న, బొండాడ నాగమణి, సూరయ్యకాపు, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

వరద ఉధృతి .. భయం గుప్పెట్లో లంక గ్రామాలు

మామిడికుదురు సెప్టెంబరు 11: గోదావరికి వరద తీవ్రత పోటెత్తడంతో లంకగ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో ఉన్నారు. క్రమేణా వరద అప్పనపల్లి కాజ్‌వేను ముంచెత్తడడంతో కాజ్‌వేపై నుంచి రాకపోకలు నిలిపివేశారు. అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి అప్పనపల్లి ఉచ్చులవారిపేట వద్ద వరద పరిస్థితిని పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉచ్చువారిపేటకు వెళ్లే రహదారిపై రెండు అడుగుల నీరు చేరడంతో ఆ నీటిలోనే లంక గ్రామాల ప్రజలు ప్రయాణాలు చేస్తున్నారు. అప్పనపల్లిలో ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన 25మంది బృందం సిద్ధంగా ఉంది. రెండు నెలల్లో నాలుగుసార్లు వరద రావడంతో లంక గ్రామల ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

యానానికి వరద తాకిడి

యానాం, సెప్టెంబరు 11: ఎగువన కురుస్తున్న వర్షాలకు గౌతమి గోదావరికి వరద నీరు చేరడంతో యానాం ఫెర్రీ రోడ్డులో పర్యాటక ప్రాంతాలకు వరద నీరు చేరింది. వరద పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానిక పరిపాలనాధికారి కార్యాలయంలో బుధవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో ఆర్‌ఏ మునిస్వామి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించా రు.ఈసందర్భంగా ముంపు ప్రాంతాలను వారు పరిశీలించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తానని మల్లాడి అన్నారు.

కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతి

కె.గంగవరం, సెప్టెంబరు 11: ఏగువ ప్రాంతాల నుంచి గోదావరిలోకి వస్తున్న వరద నీటితో కోటపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తుంది. ఫెర్రీ రేవు వరద నీటిలో చిక్కుకుంది. ఫెర్రీ రేవులో దుకాణసముదాయం, పుష్కరాలరేవులోని మెట్లు వరద నీటిలో మునిగిపోయాయి. నదిలో కొట్టుకువస్తున్న కర్ర దుంగలను స్థానికులు సేకరిస్తున్నారు. కోటిపల్లి, కోట గ్రామాల్లోని లంక పొలాల్లోకి నీరు చేరుకుంది. కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతిని తహసీల్దార్ కె.సూర్యారావు, ఎంపీడీవో ఎన్.శ్రీనివాసు పరిశీలించారు. వదరపై అప్రమత్తంగా ఉన్నామని తహసీల్దార్ సూర్యారావు చెప్పారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని రెవెన్యూసిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు.



కె.గంగవరం: కోటిపల్లి ఫెర్రీ రేవులో దుకాణ సముదాయానికి చేరిన వరదనీరు

వాణిజ్య పంటలు నీట మునక

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 11: నదీ పరివాహక ప్రాంతాలు తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, అద్దంకివారిలంక, పల్లపులంక, నారాయణలంక, వీధివారిలంక, కేదార్లంక గ్రామాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. లంకగ్రామాల్లోని శివారు ప్రాంతాల్లోకి నీరు చేరడంతో లంక పొలాలు నీటమునిగి కూరగాయలు, ఉద్యానపంటలు ముంపు నీటిలో ఉన్నాయి. లంక గ్రామాల్లోని ఇటుక బట్టీలకు నీరు చేరడంతో బట్టీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. అద్దంకివారిలంక, పల్లపులంక, నారాయణలంక, వీధివారిలంక, కేదార్లంక గ్రామాల్లో వరద ప్రాంతాలను తహసీల్దార్ చిన్నారావు, ఎంపీడీవో కొండలరావు, మండపేట సీఐ దొరరాజు, అంగర ఎస్ఐ రవికుమార్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ చిన్నారావు మాట్లాడుతూ 5లంక గ్రామాలకు 5గురు మండలస్థాయి అధికారులను, సచివాలయ సిబ్బందిని నియమించామన్నారు. అవసరమైన చోట్ల ఇంజన్ బోట్లు సిద్ధం చేశామన్నారు. ఆయా గ్రామాల ఫ్లడ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

లంక గ్రామాలకు పొంచి ఉన్న ప్రమాదం

ఆలమూరు, సెప్టెంబరు 11: బడుగువానిలంక, చెముడు లంక, మడికి, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూములలోకి భారీగా వరద నీరు చేరడంతో వాణిజ్య పంటలు నీట మునిగాయి. వరద ఉధృతి మరింత పెరిగే సూచనలు ఉన్నట్లుగా వస్తున్న సమాచారంతో బడుగువాని లంక లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే అధికారులు సూచనలు అందించారు. జొన్నాడ వద్ద రెండు బ్రిడ్జిల మధ్య గోదావరి ఉధృతి అధికంగా ఉండటంతో ప్రవాహం జోరుగా ఉంది. జొన్నాడ పుష్కర ఘాట్ వద్ద ఉన్న ఆలయాలు ముంపునకు గురయ్యాయి. కొందరు గోదావరి మాతకు పూజలు చేస్తున్నారు.

వరద ఉధృతి

ఆత్రేయపురం, సెప్టెంబరు 11: వరద ఉధృతి రోజురోజుకు పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. వివిధ గ్రామాల్లో గోదావరి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తగా బోట్లను ఏర్పాటుచేశారు. వరదతో లంక గ్రామాల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులనుసురక్షిత ప్రాంతాలకు తరలించారు. రైతులు ఎవరూ లంకల్లోకి వెళ్లకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో తహసీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో నాతి బుజ్జి పర్యటించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

మళ్లీ పోటెత్తిన డ్రెయిన్లు

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 11: ఎగువ ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. ముంపునీరు డ్రెయిన్లలోకి చేరడంతో సార్వా చేలకు మళ్లీ ముంపు ముప్పు వచ్చింది. ఓల్డ్ అయినాపురం, రంగరాజుకోడు, గొరగనమూడి, ఉత్తర, దక్షిణ పీకాలేరు, న్యూసమనస, ఓల్డ్ సమనస డ్రెయిన్లు ముంపునీటితో పోటెత్తాయి. దీంతో కూనవరం మేజర్ డ్రెయిన్‌లోకి భారీ స్థాయిలో ముంపునీరు చేరుతోంది. మీడియం డ్రెయిన్లలో నీటి ప్రవాహం అధికం కావడంతో పొలాల్లోని నీరు డ్రెయిన్లలోకి రాకుండా డ్రెయిన్ల నుంచే ముంపునీరు పొలాల్లోకి ప్రవహిస్తోంది. దీనితో ఇప్పటివరకు కొన ఊపిరితో ఉన్న వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం, పేరాయిచెరువు, వాడపర్రు, గొల్లవిల్లి ప్రాంతాల్లో వరి పొలాలు జలాశయాలుగా కనిపిస్తున్నాయి.

వరద ప్రభావిత ప్రాంతాల్లో జేసీ పర్యటన



అంతర్వేది: సఖినేటిపల్లి రేవులో వరద ఉధృతిని జేసీకి వివరిస్తున్న మండల అధికారులు

అంతర్వేది, సెప్టెంబరు 11: అఖండ గోదావరి వరదల నేపథ్యంలో లంక గ్రామాల్లో ముంపు బాధితుల సహాయ పునరావాస చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక అధికారులు, స్థానిక సిబ్బంది, సచివాలయ సిబ్బంది సర్వ సన్నద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. బుధవారం అప్పనరామునిలంక, సఖినేటిపల్లి లాకోపేట, గీతామందిరం, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లిలంక, ఏటిగట్టు ప్రాంతాలను జేసీ నిషాంతి సందర్శించి వరద సహాయక చర్యల నిమిత్తం చేపట్టిన ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. సఖినేటిపల్లి ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ లాకు వద్ద లాకుల పనితీరును ఆమె పరిశీలించారు. ప్రతీ ఫెర్రీ పాయింట్ వద్ద మండల స్థాయి ఇన్‌చార్జి అధికారులను నియమించామనానరు. ఈపర్యవేక్షణలో వరద సహాయక చర్యల ప్రత్యేక అధికారి, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, మండల తహసీల్దార్ సీహెచ్ భాస్కర్, జలవనరుల సహాయక ఇంజనీర్ రమేష్, సర్వేయర్ భద్రం, ఏపీవో నాగప్రసాద్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, కూటమి శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.

నదీ పాయలు వద్ద అప్రమత్తంగా ఉండాలి

పి.గన్నవరం, సెప్టెంబరు 11: గోదావరి నదీపాయలు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ సూచించారు. మండలంలో పలు వరద ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఆయన సిబ్బందికి సూచనలు చేశారు. సాయంత్రం ఆరు దాటితే నదీపాయలపై రాకపోకలు నిలిపివేయాలన్నారు. తహశీల్దార్ పి.శ్రీపల్లవితో కలిసి మానేపల్లి శివారు శివాయిలంక, పల్లిపాలెం, గంటిపెదపూడి శివారు బూరుగులంక నదీపాయ, కాజ్‌వేలను ఆర్డీవో పరిశీలించారు. ఆర్డీవో వెంట ఎంపీడీవో ఎం.భారతి, సిబ్బంది ఉన్నారు.

కొబ్బరి ఉత్పత్తులకు విదేశాల్లో మార్కెటింగ్ లభించాలి

ముమ్మిడివరం, సెప్టెంబరు 11: కొబ్బరి ఉప ఉత్పత్తులను విదేశాల్లో మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా రైతు అధిక లాభాలను ఆర్జించవచ్చునని రాష్ట్ర కొబ్బరి ఉత్తర రైతు కోట్ల వెంకటశ్రీరామారావు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలో బుధవారం జిల్లాలోని కొబ్బరి రైతులకు కొబ్బరి ఉత్పత్తుల ద్వారా అధిక లాభాలను ఆశించడం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొబ్బరితో కోకోనట్ పౌడరు, కోకోనట్ మిల్క్, కోకోనట్ వాటర్, వర్జీనియా కోకోనట్ ఆయిల్, చిప్స్ వంటి పలు రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చునన్నారు. టాటా, ఐటీసీ వంటి పెద్ద కంపెనీలను ఆహ్వానించి వాటికి ప్రత్యేక రాయితీలు కల్పించి ప్రాంతంలో కోకోనట్ ఆధారిత పరిశ్రమను ఏర్పాటు చేసినట్టయితే కొబ్బరి రైతులకు అధిక లాభాలు లభించడంతో పాటు యువత ఉపాధి అవకాశాలు కూడా పెంపొందించవచ్చన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో లక్ష ఎకరాల్లో 70లక్షల కొబ్బరి చెట్లు ఉన్నాయని, సంవత్సరానికి రూ.42కోట్లు కొబ్బరికాయల ఉత్పత్తి జరుగుతుందన్నారు. కొబ్బరి బొండాలు తీయడం వల్ల చెట్టుకు మేలు జరుగుతుందని, మిగతా కొబ్బరి పిందెలకు ఆహారం బాగా అందడంతో పాటు 25శాతం కాపు పెరుగుతుందన్నారు. కొబ్బరి ఉత్పత్తులు సాధించడం, మార్కెటింగ్, కొబ్బరి ఆధారిత పరిశ్రమలఏర్పాటు, కొబ్బరిసాగు, యాజమాన్య పద్ధతులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కోనసీమకు చెందిన రైతులు పాల్గొన్నారు.



రాష్ట్ర కొబ్బరి రైతు కోట్ల వెంకట శ్రీరామారావు

అధ్యాపకులకు జీతాలు చెల్లించాలి

మలికిపురం, సెప్టెంబరు 11: మలికిపురం ఎంవీఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు జీతాలు చెల్లించాలంటూ అధ్యాపకులు కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. అధ్యాపకులు తరగతులను బహిష్కరించారు. అధ్యాపకులకు మద్దతుగా విద్యార్థులు ధర్నాలో పాల్గొన్నారు. కళాశాల పాలకవర్గం, పెద్దలు కలిసి గురువారం సమావేశమవ్వడానికి కరస్పాండెంట్ అంగీకరించడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో అధ్యాపకులతో పాటు మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ సిబ్బందికి సహకరించాలి

అంబాజీపేట, సెప్టెంబరు 11: గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ సిబ్బందికి కూలీలు సహకరించాలని ఎంపీడీవో జీవీ సరోవర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2023-24 ఏడాదికి మండలంలో రూ.9.71కోట్లతో పనులు చేపట్టామన్నారు. పంచాయతీరాజ్ పనులు రూ.2.19కోట్లతో పనులు నిర్వహించామన్నారు. ఈవోపీర్డీ మమత, ఏపీవో అడపా వెంకటశ్రీకృష్ణ, ఎస్ఆర్పీ, డీఆర్పీ, సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతకుమారి, జల్లి బాలరాజు, ఎంపీటీసీలు ముత్తాబత్తుల ప్రశాంత్, పబ్బినీడి రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు జీజీవీకే కుమార్, సత్యవేణి, చంటి, తాతాజీ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్యవర్గం ప్రమాణ స్వీకారం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 11: అమలాపురం పచ్చిగోళ్ల జనార్దనరావు కల్యాణ మండపంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వైశ్యసంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయుడు, కార్యదర్శి ప్రగలపాటి కనకరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు, కొణిజేటి రోశయ్య విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యవర్గ సభ్యులతో ఆర్యవైశ్య మహాసభ జిల్లాశాఖ అధ్యక్షుడు కంచర్ల బాబి, మాజీ అధ్యక్షుడు పల్లపోతు బంగారం, జోనల్ మాజీ చైర్మన్ కుసుమంచి పాపారావు ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మరోజున ప్రభుత్వ పరంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. నూతన అధ్యక్షుడిగా నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శిగా నంబూరి సురేష్, కోశాధికారిగా కొమ్మూరి వెంకటాచలప్రసాద్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర మహాసభ ప్రతినిధులు కొల్లూరి చినబాబు, నంబూరి రెడ్డియ్య, వరదా సూరిబాబు, యెండూరి రాఘవ, యెండూరి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

రావులపాలెం, సెప్టెంబరు11: మండల పాస్టర్ ఫైట్ ఫెలోషిప్, కొత్తపేట నియోజకవర్గ జేఏసీ పాస్టర్లు విజయవాడ వరద బాధితులకు సాయాన్ని అందించారు. బియ్యం, నూనె, చీరలు, దుప్పట్లు, నిత్యావసర సరుకులను లారీల్లో తీసుకువెళ్లారు. అధ్యక్షుడు పి.మధుబాబు, ఎస్.సుంగధరత్నం, జేఏసీనాయకులు అమృతరావు, రాజేంద్ర ప్రసాద్, హెల్పింగ్‌హ్యాండ్స్ టీమ్ రమేష్ పాల్గొన్నారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్‌లో మంటలు

యానాం,సెప్టెంబరు11: యానాం -ద్రాక్షారామ రోడ్డులో కాపులపాలెం జంక్షన్‌కు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై ఒక వ్యక్తి వెళ్తున్నాడు. బైక్ ఇంజన్‌లో మంటలు చెలరేగడంతో సమీపంలోని పెట్రోల్ బంక్ సిబ్బంది మంటలను ఆపారు.

రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ తీర్పు

అమలాపురం, ముమ్మిడివరంలలో ధర్నాలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 11: భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పును ఇవ్వడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట బుధవారం మాలమహానాడు జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి మాలమహానాడు నాయకులు కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నా శిబిరం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్ష చేయాలంటూ నినాదాలు చేశారు. పార్లమెంటు ఉభయ సభల ఆమోదంతోనే ఎస్సీ వర్గీకరణ జరగాల్సి ఉందన్నారు. ఉండ్రు బాబ్జి, జల్లి శ్రీను, పెయ్యల పరశురాముడు, నాతి శ్రీనివాసరావు, జగడం సత్యనారాయణ, ఉబ్బన శ్రీనివాసరావు, బొంతు రమణ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా శిబిరంలో పలువురు వక్తలు మాట్లాడారు. అమలాపురం బార్ అసోసియేషన్ వద్ద నుంచి ఎస్సీ న్యాయవాదులు ర్యాలీగా ధర్నా శిబిరం వద్దకు చేరుకుని సంఘీభావం తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో జేఏసీ నాయకులు గూటం సాయి, గెల్లా రాజేంద్ర, బొంతు రమణ, మెండి డేవిడ్‌రాజు, గెద్దాడ బుద్ధరాజ్, చీకురుమెల్లి కిరణ్‌కుమార్, కొంకి రాజామణి, పరమట రాంప్రసాద్, కుంచే బాబులు తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం: మాలమహానాడు జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఆ తీర్పు రాజ్యాంగ విరుద్ధం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 11: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని దళిత ఐక్యవేదిక జిల్లాశాఖ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, బహుజన సమాజ్ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. దళిత ఐక్యవేదిక చైర్మన్ డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబూరావు, కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, ఆల్దా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ములపర్తి సత్యనారాయణ, దేవరపల్లి శాంతకుమార్, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, సరెళ్ల రామకృష్ణ, వడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన

ముమ్మిడివరం, సెప్టెంబరు 11: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ముమ్మిడివరంలో మాలమహానాడు, జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ముమ్మిడివరం పోలీసుస్టేషన్ సెంటర్ నుంచి మాలమహానాడు జేఏసీ నాయకులు నీలి రంగు జెండాలు పట్టి ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేసి బ్యానర్లు చేతబట్టి ప్రదర్శించారు. దళితుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ ఎం.సుబ్బలక్ష్మికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో దేవరపల్లి ఏడుకొండలు, కాశి జగపతిరావు, మెండి కృష్ణబాబు, కాశి బాలమునికుమారి, మోకా రామారావు, కాట్రు అప్పారావు, దాసరి వెంకటరమణ, కాశి లాజర్, జనిపల్లి సత్యనారాయణ, ఎన్.అబ్బులు, సబ్బతి శేఖర్, బి.సహదేవుడు, నీలం చినబాబు, బరగడ వరప్రసాద్, సబ్బతి డేవిడ్‌రాజు, బొంతు నాగరాజు, జంగా చిరంజీవి, అయితాబత్తుల సురేష్, జంగా లోవరాజు, చెల్లి మధు, పులిదిండి రాజేష్, యడ్ల చిట్టిబాబు, సత్తిబాబు, కల్యాణ్ పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

పి.గన్నవరం, సెప్టెంబరు11: విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో మూడు రోజులుగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పర్యటిస్తున్నారు. బుధవారం 46వ డివిజన్‌లో జక్కంపూడి కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, చిట్టినగర్ 174వ బ్లాక్ ప్రాంతాల్లో పర్యటించారు. శానిటేషన్, నిత్యావసరాల పంపిణీ, ఆరోగ్య శిబిరాలు, డ్రైనేజీల్లో పూడికతీత పనులు పరిశీలించారు. ఈడివిజన్ పరిధిలోనిమిల్క్ ఫ్యాక్టరీ, క్వార్టర్స్, రాజుశర్మనగర్, కెఎల్‌రావుపార్క్ ఏరియా, లంబాడిపేట, భీమన్నవారిపేట, సచివాలయాలు, విజయవాడ వెస్ట్ పరిధిలోని ముంపు ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ అధికారుల బృందం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి గృహోపకరణాలు, ఇళ్లు,వాహనాలు అంశాల్లో నష్ట వివరాలను సేకరించారు. స్థానిక కూటమి నాయకులు, అధికారులు ఉన్నారు.

స్టాఫ్ నర్సుల ఆందోళన

ముమ్మిడివరం, సెప్టెంబరు 11: జీవో నంబరు 117ను రద్దుచేసి రెగ్యులర్ చేయాలంటూ కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు ఆందోళన నిర్వహించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయానికి ర్యాలీగా తరలివచ్చి డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావుదొరకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో యు.అచ్యుతవల్లి, పి.నాగలక్ష్మి, ఎన్.విజయ, జి.గౌతమి, జి.దుర్గమ్మ, పి.ధనలక్ష్మి, ఎం.రమావతి, వై.మణికుమారి, పి.అమల, టి.రుతమ్మ పాల్గొన్నారు.

వినాయకుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి, సెప్టెంబరు 11: అయినవిల్లి సిద్ధివినాయక ఆలయంలో స్వామివారి దర్శనానికి బుధవారం భక్తులు పోటెత్తారు. గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, పంచహారతులు, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. అమలాపురం పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్‌మాధుర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఎంపీ వెంట మెట్ల రమణబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, మద్దాల సుబ్బారావు, కాకర శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ

రాజోలు, సెప్టెంబరు 11: రాజోలు నున్నవారి బాడవలో 40వరద బాధిత కుటుంబాలకు బుధవారం ఎంపీపీ కేతా శ్రీను ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. గ్రామస్తులు విద్యుత్ సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఎంపీపీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు హిజ్రాలపై కేసు

అంబాజీపేట, సెప్టెంబరు 11: దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు హిజ్రాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు. పుల్లేటికుర్రు గ్రామపరిధి వీవర్స్‌కాలనీకి చెందిన చింతా సత్యవెంకట అచ్యుతరాజేంద్రప్రసాద్ మంగళవారం అమలాపురం కిమ్స్ ఆసుపత్రి నుంచి మొసలపల్లి మీదుగా ఇంటికి వెళ్తున్నాడు. చింతాలమ్మ ఆలయానికి వెళ్లే దారిలో ఇద్దరు హిజ్రాలు రాజేంద్రప్రసాద్ బైక్‌ను ఆపారు. అతడ్ని కొట్టి గాయపరిచి అతని వద్ద డబ్బులు లాక్కుని హిజ్రాలు వేరే వ్యక్తి సాయంతో ముగ్గురు మోటార్‌సైకిల్‌పై పారిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనాలు అడ్డుకుని గ్రామస్తుల ఆందోళన

మామిడికుదురు సెప్టెంబరు 11: పాశర్లపూడిలో రైల్వేలైన్ పనుల కోసం వస్తున్న వాహనాలను అడ్డుకుని పాశర్లపూడి గ్రామస్తులు నిరసన తెలిపారు. గతంలో రైల్వే కాంట్రాక్టరు పంచాయతీ సంబంధించిన రోడ్డును ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి విస్మరించడంపై ఆందోళన చేపట్టారు. వాహనాలు తిరగడం వల్ల రోడ్డు పాడైపోయిందని, ఈరోడ్డు ఏర్పాటుచేసి పనులు నిర్వహించుకోవాలని తేల్చిచెప్పారు. మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, స్థానికులుపాల్గొన్నారు.

3 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత

ద్రాక్షారామ, సెప్టెంబరు 11: ద్రాక్షారామలో మంగళవారం రాత్రి వ్యానులో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కె.గంగవరం మండలం సత్యవాడ నుంచి కాజులూరు మండలం గొల్లపాలెం చేపల చెరువులకు ట్రక్‌వ్యానులో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని రాత్రి విజిలెన్సు సీఐ నాగరాజు పట్టుకున్నారు. రూ.1.39లక్షలు విలువైన వ్యానులో 68బస్తాలు (3,023కిలోలు) ఉన్నట్లు గుర్తించారు.ఎంఎస్‌వో సుబ్బరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ కేసు నమోదు చేసి బియ్యం తరలిస్తున్న యజమాని సలాది సత్యనారాయణ, వ్యాను డ్రైవరు చిలకల సాయి కృష్ణలను అరెస్టు చేశారు. పట్టుబడిన బియ్యాన్ని బుధవారం వేములపల్లి సివిల్ సప్లయిస్ గొడౌనుకు తరలించారు. వ్యానును ద్రాక్షారామ పోలీసులు సీజ్ చేశారు. హెచ్‌సీ జీవానందం, లోవరాజు, ద్రాక్షారామ వీఆర్‌వో సాయి పాల్గొన్నారు.

వరద బాధితులకు కౌన్సిలర్ల నెల వేతనం

మండపేట, సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితుల కోసం మండపేట టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్లు 10మంది నెల వేతనం రూ.30వేలు బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలోఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వల్లూరి సాయికుమార్‌బాబు, నల్లమిల్లి వీర్రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ద్వారపూడిలో ప్రత్యేక పారిశుధ్య పనులు



ద్వారపూడి పంచాయతీలో పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

మండపేట, సెప్టెంబరు 11: ద్వారపూడిలో ప్రత్యేక పారిశుధ్య పనులను పంచాయతీ కార్యదర్శి ఆకుల వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గ్రామంలో గుర్కాబీడు వద్ద వున్న చెత్తను జేసీబీ సాయంతో డంపింగ్ యార్డుకు తరలించారు. పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. చెత్తాచెదారం వీధుల్లో వేయకుండా పారిశుధ్య సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు అందించాలని కోరారు. పూర్తిస్థాయిలో శానిటేషన్ చేపట్టామన్నారు.

నేడు ఎలుకల నివారణ మందు పంపిణీ

రాయవరం, సెప్టెంబరు 11: మండలంలోని 19 రైతు భరోసా కేంద్రాల ద్వారా గురువారం ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ తెలిపారు. బ్రోమోడయోలిన్ మందును నూకలతో కలిపి ఉచితంగా ఇస్తామన్నారు.

పంచాయతీకి ఫాగింగ్ యంత్రం అందజేత

రాయవరం, సెప్టెంబరు11: రాయవరం గ్రామపంచాయతీకి ఫాంగింగ్ యంత్రాన్ని బుధవారం వెలగల పణికృష్ణారెడ్డి అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, వార్డు సభ్యుడు ఉండవిల్లి రాంబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పి.గన్నవరం, సెప్టెంబరు11: నరేంద్రపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు పనులకోసం గురువారం ఉదయం 9నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. నరేంద్రపురం, రాజులపాలెం, కుందాలపల్లి, ఉడిమూడి, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం, గంటిపెదపూడి, పశ్చిమగోదావరి పెదమల్లంక, అంబాజీపేట మండలం ఇసుకపూడికి సరఫరా ఉండదన్నారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన జడ్జి

రాజోలు, సెప్టెంబరు 11: రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలారాణి శివకోటిలో 18ఎకరాల కాలనీలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలకు సంబంధించిన వివిధ రిజిష్టర్లు, తరగతి గదులు, బాత్‌రూమ్‌లు, వంటశాల, పడకగదులను ఆమె పరిశీలించారు. మెనూను పాటించాలని ప్రిన్సిపాల్ టి.లలితకుమారికి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ రికార్డులను సిద్ధం చేయండి

అల్లవరం, సెప్టెంబరు 11: సోషల్ ఆడిట్ రికార్డులను సిద్ధం చేయాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను ఎంపీడీవో కృష్ణమోహన్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమీక్షించారు. గోకులం దరఖాస్తులు కార్యాలయంలో అందజేయాలని, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. గ్రామసభల తీర్మానాలు, ఎస్టిమేట్లు వేయాలని ఆదేశించారు. ఏపీవో శ్రీనుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ పర్యటన

కాట్రేనికోన, సెప్టెంబరు11: గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కోనసీమ ప్రాంతం వరద బారినపడే అవకాశముందని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. 48గంటలు పల్లపు ప్రాంత లంక వాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బుధవారం నడవపల్లి పల్లిపాలెం, పల్లంకుర్రు గ్రామాల్లో పర్యటించి ముంపు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. వరద సమయంలో బాధితులకు తాగునీరు అందించాలని, పునరావాస సహాయ కార్యక్రమాలు అందించి బాసటగా నిలవాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకాధికారి ఝాన్సీరాణి, తహసీల్దార్ పి.సునీల్‌కుమార్, ఎంపీడీవో చలం పాల్గొన్నారు.

రూ.70వేలు పలికిన గణనాథుడి లడ్డూ

పి.గన్నవరం, సెప్టెంబరు 11: మానేపల్లిలో వరసిద్ధి వినాయకుని ఆలయం వద్ద స్వామి వారి లడ్డూకు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన బొక్కా శ్రీనివాస్ కుమారుడు అమేష్ రూ.70 వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.

మోటారుసైకిళ్ల దొంగ అరెస్టు

ముమ్మిడివరం, సెప్టెంబరు 11: మోటారు సైకిళ్ల దొంగను అరెస్టు చేసినట్టు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ముమ్మిడివరం బైపాస్ రోడ్డులో తిరుగుతున్న ఆలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన సుంకర నాగబాబును సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ అరెస్టు చేశారన్నారు. అతడ్ని విచారించగా ముమ్మిడివరం స్టేషన్ పరిధిలో 2మోటారు సైకిళ్లు, రామచంద్రపురం, కాకినాడ, రాజమహేంద్రవరం పోలీసుస్టేషన్ల పరిధిలో 9మోటారు సైకిళ్లు దొంగిలించినట్టు తేలిందన్నారు.మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్టు డీఎస్పీ తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: డిమోంటీ
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
శేఖర్ స్క్రీన్-2	: డబుల్ ఇస్మార్ట్
రమా	: ఆయ్
గణపతి	: రేవు
వెంకటపద్మావతిస్క్రీన్-1	: తంగలాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ఏలియన్ రొమ్ములస్

ఇసుక అక్రమ తరలింపు

3లారీలు, జేసీబీ పట్టుకుని అప్పగించిన స్థానికులు

ఆలమూరు, సెప్టెంబరు11: ఆలమూరు-జొన్నాడ రోడ్డులో మంగళవారం రాత్రి ఇసుక అక్రమ రవాణా గుట్టురట్టయింది. ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు ఏడాది క్రితం ప్రతిపక్ష నేత హోదాలో ఉండగా ఇక్కడ నిల్వ చేసిన కొండలాంటి ఇసుక గుట్టలను గుర్తించి అక్రమార్కులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే ఆయన అధికారంలోకి వచ్చేసరికి వాటిని తొలగించారు. ప్రస్తుతం కొంత మేర ఉన్న ఆ ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి జేసీబీతో ఇసుక లోడు చేస్తుండగా స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు అక్కడికి చేరుకుని 3లారీలు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకుని స్థానిక స్టేషన్‌కు తరలించారు. ఇసుక తరలిస్తున్న 3లారీలు, జేసీబీని స్వాధీన చేసుకుని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.ఇసుకను అక్రమంగా నిల్వచేసిన జి.వెంకటరెడ్డి, జేసీబీ, లారీల డ్రైవర్లతో పాటు 3లారీల ఓనర్లపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

ముంపు బాధితులకు సాయం పంపిణీ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 11: విజయవాడ 18వడివిజన్‌లో రాజస్థాన్, బిహార్ ప్రాంతాలకు చెందిన వరద ముంపు బాధితులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, గద్దె క్రాంతికుమార్ తదితరులు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ నాయకులు సమకూర్చిన పశుగ్రాసాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి రైతులకు పంపిణీ చేశారు.



అప్పాపంతుల వెంకట సుబ్బారావు	గబ్బల ఫణికుమార్
మొయిల శివ	ఇళ్ళ రామ్మోహనరావు
దొమ్మేటి బాజి	పిల్లా వీరభద్రరావు
పిల్లా నాని	గుమ్మళ్ళ పుల్లయ్యనాయుడు
పురుషోత్తం వీరవెంకట్రావు	అప్పాపంతుల తిరుమల
నామన దుర్గారావు	నాళం సూర్యనారాయణమూర్తి & బ్రదర్స్
శ్రీ డైమాండ్ రెస్టారెంట్	చవ్వాకుల నాగేశ్వరరావు & సన్స్
చవ్వాకుల చంటి, అప్పన దుర్గారావు	మల్లింశెట్టి త్రిమూర్తులు & బ్రదర్స్